క్లుప్తంగా

జగనన్న సురక్ష పథకాన్ని వినియోగించుకోండి



వలంటీర్ల శిక్షణలో మాట్లాడుతున్న దొడ్డి రామానంద్

అల్లిపురం : జూలై 1 నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని జేసీజే ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు దొడ్డి రామానంద్ కోరారు. 31వ వార్డు చాకలిపేట సచివాలయంలో శుక్రవారం ఆయన జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్వీనర్లు, గృహ సారథుల సహకారంతో ప్రతి వలంటీర్ విధిగా ప్రతి ఇంటికి వెళ్లి కావాల్సిన పత్రాలు, పథకాలు అప్లోడ్ చేయాలని, వారాంతంలో జరిగే క్యాంపుకు వారిని తీసుకువచ్చి సంబంధిత పత్రాలు ఉచితంగా అందజేయాలని కోరారు. ఎంఎల్‌వో రాజు, కన్వీనర్లు రాంబాబు, కర్రి ధనలక్ష్మి, కేపీ నాయుడు, బాబురావు, శ్రీదేవి, బంగార్రాజు, కొండా భవానీ, పిలకా మోహన్, వెంకటేశ్వరరెడ్డి, ఎల్లాజీ, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏపీ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్రివేముల శ్రీనివాస్ అన్నారు. అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు 821వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో విద్యార్థులు, కార్మికులు, మేధావులు, రాజకీయ నాయకులు దీక్షలో పాల్గొని మద్దతు తెలుపుతున్నారని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏపీ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, జిల్లా అధ్యక్షుడు పెద్దాడ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాల కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

మహారాణిపేట : జీవీఎంసీ 36వ వార్డు సున్నపువీధి డౌన్, వినాయకగుడి వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో అలమండ విజయ్ ఆధ్వర్యంలో మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. 135 మంది గర్భిణులకు పసుపు, కుంకుమతో పాటు గాజులు, చీర, స్వీట్స్, పండ్లు, హార్లిక్స్ పాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పల వెంకట్రావు, బొడ్డేటి కిరణ్, కొప్పల భాస్కరరావు, ఓడూరు శ్రీను, వార్డు మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ జమీల్, మదీనా, మాధవ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సిహెచ్. సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్, వాటర్(సముద్రం) కేటగిరీల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. వివరాలు, దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి https:// awards. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అప్‌లోడ్ చేసిన పత్రాలు, నామినేషన్ సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు దరఖాస్తును ఈనెల 4వ తేదీలోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి/ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేటంలో పని వేళల్లో సమర్పించాలని ఆయన కోరారు.

తలుపు తట్టి.. కుశలమడిగి..

- ప్రజాసేవలో కొత్త పుంతలు తొక్కుతున్న ప్రభుత్వ చిత్తశుద్ధి
- జగనన్న సురక్షతో అన్ని వర్గాలకు మేలు
- ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు పరిష్కరించనున్న ప్రభుత్వం
- పేదలకు మేలు చేయడమే లక్ష్యంగా అలుపెరుగని పయనం



సచివాలయంలో అర్హులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

గతంలో ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలోని ఉద్యోగులతో ఏదైనా పని చేయించుకోవాలంటే తల ప్రాణం తోకకి వచ్చేది. ఉత్తరమో.. దక్షిణమో సమర్పించుకోకపోతే ఇక ఆ పని అయినట్టే.. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే నేరుగా ప్రజల ముంగిటకు వచ్చింది. పేదల గడపలోకే అన్ని సంక్షేమ పథకాలు వచ్చి వాలుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందిస్తున్న ఒక్కో పథకం తాడిత, పీడిత, బడుగు, బలహీనవర్గాలకు బతుకుపై కొత్త ఉత్సాహం కల్పిస్తూ.. మేమూ బతకగలం అనే భరోసా అందిస్తున్నాయి. మా గురించి ఆలోచించే మనసైన నేత మాకున్నాడు అనుకుంటూ వారంతా ఇప్పుడు 'జగన్‌బాబుకి జై'అంటూ నినదిస్తున్నారు.

డాబాగార్డెన్స్: పేదలకు మేలు చేసేందుకు 'జగనన్న సురక్ష' పేరిట మరో కార్యక్రమం ప్రజలను పలకరించనుంది. దేశ చరిత్రలో ప్రతి ఇంటికి వెళ్లి, ఏమైనా సమస్యలున్నాయా అని అడగనున్న తొలి ప్రభుత్వంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేరు తెచ్చుకుంటోంది. నోరు తెరిచి అడగలేని, అర్హత ఉండి పొరపాటున ఎక్కడైనా మిగిలిపోయిన అర్హుల తలుపు తట్టి, లబ్ధి చేకూర్చే కార్యక్రమమే జగనన్న సురక్ష. ఈ కార్యక్రమం నియోజకవర్గ పరిధి అన్ని సచివాలయాల పరిధిలో జరగనుంది.

సచివాలయాల్లో ఉచితంగా లభించే సేవలు..

ఇప్పటికే రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా పొరపాటున ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారికి కూడా సంక్షేమ పథకాలు అందించనున్నారు. 'జగనన్న సురక్ష' ద్వారా ఇంటింటిని జల్లెడ పట్టి మరీ వారికి లబ్ధి అందించే దిశగా సాగుతున్నారు. ఇంకా ఎవరికైనా సర్టిఫికెట్లు అవసరమైతే.. జనన, మరణ, కుల, ఆదాయ, సీసీఆర్‌సీ కార్డులు, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్ వంటి 11 రకాల సేవలు ఎటువంటి సర్వీస్ ఫీజు లేకుండా ఉచితంగా అందిస్తారు. ఇందుకు వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లనున్నారు. నెల రోజుల పాటు ఉచితంగా ఆయా సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

ఎలా వెళ్లాలి..

ఇంటికి వచ్చిన వలంటీరుకు మనకు ఏ సర్టిఫికెట్ అవసరమో ముందుగా చెప్పాలి. వలంటీర్ నోట్ చేసుకున్న పిదప మీ ప్రాంతంలో గల సచివాలయానికి వెళ్లి సంబంధిత పత్రాలు అందజేయాలి. టోకెన్ నంబరు, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకొని, ఆ టోకెన్ కూడా ఆ వలంటీర్లతో కూడిన టీమ్ తీసుకెళ్లి వారి ఇంటి వద్దే ఇస్తుంది. ఏ తేదీన ఆ గ్రామంలో మండల/వార్డు స్థాయి అధికారులు క్యాంపు నిర్వహిస్తారో తెలియజేస్తారు.

1902 హెల్ప్ డెస్క్..

వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, జగనన్న మీద, జగనన్న ప్రభుత్వం మీద ప్రేమ, అభిమానం ఉన్న ఔత్సాహికులు మీ సమస్యల పరిష్కారం కోసం, మీ ఇంటిని సందర్శించినప్పుడు మీరు ఇంటి వద్ద లేకపోతే, మీ వార్డులో క్యాంపు జరిగే రోజు నేరుగా క్యాంపు వద్దకు వెళ్లినట్లయితే వలంటీర్లతో కూడిన ఈ టీమ్ మీకు 1902 హెల్ప్ డెస్క్ ద్వారా అవసరమైన సహాయం అందిస్తారు.

దేశానికే ఆదర్శం..



ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, పసి బిడ్డల నుంచి పండు ముసలి వరకు ఉపయోగపడే ఎన్నో పథకాలు తీసుకొచ్చారు. అడక్క ముందే ప్రజల అవసరాలు తెలుసుకుని, వాటిని తీరుస్తున్న జగనన్నకు జనం జేజేలు పలుకుతున్నారు. ఎన్నో పథకాలు రూపొందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా రుణ పడి ఉంటారు. జగనన్న సురక్ష ఒక మంచి కార్యక్రమం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చక్కగా అందుతున్నాయన్న ఆనందం ప్రజల కళ్లల్లో కనిపిస్తుంది. మేం గడప గడపకు వెళ్లినప్పుడు పథకాల గురించి వారంతట వారే చెబుతుండడం చాలా సంతోషంగా ఉంది. ఇవన్నీ దేశానికి ఆదర్శంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ

ఉమ్మడి పౌరస్మృతిపై ముస్లిం సమాజం సంయమనం పాటించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎ రెహమాన్

అల్లిపురం : కేంద్రం ప్రకటించిన ఉమ్మడి పౌరస్మృతిపై రాష్ట్రంలో గల ముస్లిం సమాజం సంయమనం పాటించాలని ఉత్తరాంధ్ర ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నేత డాక్టర్ ఎస్ఎ రెహమాన్ పిలుపునిచ్చారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిఫాం సివిల్ కోడ్ ప్రవేశ పెట్టేందుకు కేంద్రం తొందర పడుతుందన్నారు. మతం వ్యక్తిగతమని ఆయన స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు మతానికి ప్రభుత్వ పనులతో ముడిపెట్టొద్దని చెప్పిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి సున్నితమైన సమస్యలు చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించబడతాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా గత 75 ఏళ్లుగా స్వతంత్ర భారతదేశంలో ప్రజలంతాఐకమత్యంగానే ఉన్నారన్నారు. దేశంలో పలుమతాలు, కులాల అభిప్రాయంతోనే ఉమ్మడి పౌరస్మృతిపై నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల ముందు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదన్నారు. ఇదే విషయాన్ని 21వ లా కమిషన్ 2018లో చెప్పిందని తెలిపారు. దీనిపై ముస్లింలు సంయమనం పాటించాలని, ఎవరు రెచ్చగొట్టినా రెచ్చిపోవద్దన్నారు. 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ మాట్లాడుతూ ఈ తరుణంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదన్నారు. సమానత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం యూనిఫాం సివిల్ కోడ్ తీసుకువస్తామనడం సమంజసం కాదన్నారు. భారతదేశంలో ఈ ఇష్యూ తప్ప ఇంకేమీలేదా అని ఆయన ప్రశ్నించారు. న్యాయవాది ఐఎం అహ్మద్ మాట్లాడుతూ అన్ని మతాలకు కొన్ని విశ్వాసాలు, నమ్మకాలు ఉంటాయన్నారు. ఎవరిని పెళ్లి చేసుకోవాలి, నా వారసులు ఎవరు, నా సంపదను నా వారసులకు ఎలా ఇవ్వాలి, ఎవరిని దత్తత తీసుకోవాలన్నవి వ్యక్తిగత విషయాలన్నారు. వీటిపై ముస్లిం సమాజం చాలా స్పష్టంగా ఉందన్నారు. యూనిఫాం సివిల్ కోర్టు డ్రాఫ్ట్ ఏమిటన్నది ముందు కేంద్రం డ్రాఫ్ట్ రిలీజ్ చేయాలని డిమాండ్‌చేశారు. అప్పుడు అభిప్రాయాలు అడిగితే బాగుంటుందని ఆయన సూచించారు. సమావేశంలో ఎండీ షరీఫ్, షేక్ బాబ్జి, ఇబ్రహీం, హైదర్ అలీ షింకా, రహమతుల్లా బాగ్, ఎస్కే సలీంవల్లీ, ఎండీ సలీం (దర్గా) తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి బంగారు నెక్లెస్ బహూకరణ



ఈవో శిరీషకు నెక్లెస్ అందజేస్తున్న దాతలు చిల్లా వెంకటలక్ష్మి తదితరులు



కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం

అల్లిపురం : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి సీతమ్మధార, టీపీటీ కాలనీకి చెందిన లేటు చిల్లా సత్యనారాయణరెడ్డి 61వ జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు చిల్లా వెంకటలక్ష్మి 77 గ్రాముల 310 మిల్లీ గ్రాముల బంగారు నెక్లెస్‌ను దేవస్థానం ఈవో కె.శిరీషకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారికి క్షీరాభిషేకం..

ప్రతి శుక్రవారం మాదిరి ఈ వారం అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఉభయదాతల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



గరికిన అప్పన్నకు ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఆపదలో ఉన్నవారికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలపై ఆయనే స్వయంగా బాధితుల ఇళ్లకు వెళ్లి ఆర్థిక సహకారం అందజేశారు. 38వ వార్డు బుక్కావీధికి చెందిన గనగళల తోటయ్య చేపలవేట సమయంలో బోట్‌లో గ్యాస్ ఫైర్ అవటంతో శరీరంలో కొంత భాగం కాలిపోయింది. ఆయన వైద్యం కోసం ప్రజాదర్బార్‌లో కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు శుక్రవారం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యానికి సాయం అందిస్తామన్నారు. కేజీహెచ్‌కు తరలించి మెరుగైన వైద్యం అందజేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా 34వ వార్డులో నివసిస్తున్న గరికిన అప్పన్నకు కొన్ని రోజుల క్రితం గుండె బైపాస్ సర్జరీ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా జరిగింది. అయినప్పటికీ మందుల కోసం ఇబ్బందులు ఎదర్కొంటున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం వారి ఇంటికెళ్లి రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు కార్పొరేటర్లు మాసిపోగు మేరీ జోన్స్, తోట పద్మావతి, కోడూరు అప్పలరత్నం, పార్టీ నాయకులు మాసిపోగు రాజు, పీతల వాసు, అలపన కనకరెడ్డి, సనపల రవీంద్రభరత్, ముజీబ్‌ఖాన్, లింగం శ్రీనివాసరావు, లండా రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీకి లైకా మైక్రోటోమ్ పరికరం



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ 1997 బ్యాచ్ విద్యార్థులు పాథాలజీ విభాగానికి విరాళంగా అందించిన లైకా మైక్రోటోమ్‌ను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు శుక్రవారం ప్రారంభించారు. దాదాపు రూ. 9 లక్షలు ఖరీదు చేసే ఈ పరికరం పాథాలజీ విభాగానికి అవసరమైనది. ఈ కార్యక్రమంలో పాథాలజీ ప్రొఫెసర్ హెచ్‌వోడి డాక్టర్ సీవీ లక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ జి. పార్వతి, అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్యం రెండు కళ్లుగా సీఎం పాలన



జామియా మసీదు వద్ద ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి విద్యా, వైద్యం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 36వ వార్డు జామియామసీదు, ఏవీఎన్ కాలేజీ వద్ద జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించి అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసారన్నారు. ప్రైవేట్ స్కూళ్ల తరహాలో అడ్మిషన్లకు సిఫార్సు చేయడం ఆశ్చర్యంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే అచ్చియ్యమ్మపేట జంక్షన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి స వినతులు స్వీకరించి అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాసిపోగు మేరీజోన్స్, తోట పద్మావతి, నాయకులు మాసిపోగు రాజు, పీతల వాసు, లింగం శ్రీనివాసరావు, లండా రమణ, దశమంతుల మాణిక్యాలరావు, సనపల రవీంద్రభరత్, కుందేటి సుధాకర్, ధనరాల రాంబాబు, రమణి, బొడ్డేటి కిషోర్, అరుగుల రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవో రద్దు చేయాలి

సీతమ్మధార : ఆత్మస్థైర్యం దెబ్బతీసే జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సచివాలయం శానిటేషన్ సెక్రటరీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.పీటర్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా మున్సిపల్ టైమింగ్స్ పాటించాలని, ఏ సచివాలయ ఉద్యోగికి లేని విధంగా ఎనిమిది గంటలు ఫీల్డ్ వర్క్ కేటాయించడం దారుణమన్నారు. కింది స్థాయి అధికారులు ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా చెత్త పన్నుపై సేవా రుసుం వసూలు చేసే బాధ్యతను కార్యదర్శులకు అప్పగించారని అన్నారు. రోజువారి టార్గెట్లు పెట్టి పూర్తి చేయని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ సస్పెన్షన్ చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పడాల గోవింద్, ఏపీ శానిటేషన్–ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీస్ అసోషియేషన్ నాయకులు కె.రవీంద్ర, అడారి శివ, కె.భాగ్యలక్ష్మి, మంగరాజు, కె.సత్యనారాయణ, టి.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ధనలక్ష్మీదేవికి ప్రధాన అర్చకుడు శ్యామా ఆచార్యులు, దుర్గమాంబకు ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ కుంకుమ పూజలు, పూల, పంచామృతాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నామినేటెడ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ ఆధ్వర్యంలో జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం జిల్లాలకు చైర్‌పర్సన్లు, మెంబర్లుగా, జువెనల్ జస్టిస్ బోర్డుల్లో సోషల్ వర్కర్ మెంబర్లుగా సేవలందించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బాలల సంక్షేమ శాఖకు చెందిన ఎం.శరత్‌బాబు తెలిపారు. ఈ కమిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి ఆసక్తి గల అభ్యర్థులు 13లోగా దరఖాస్తులు పంపాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. http@// wdcw. ap. gov. in అనే వెబ్‌సైట్ ద్వారా నోటిఫికేషన్ పొందాలన్నారు. దరఖాస్తులను డైరెక్టర్, బాలల సంక్షేమం, వీధి బాలల సంక్షేమ శాఖ, 3-1-265/4ఎ, కబేళా సెంటర్ దగ్గర, విజయవాడ-520012 చిరునామాకు పంపాలని తెలిపారు.

కొరియన్ భాషతో ఉపాధి అవకాశాలు

సీతమ్మధార : కొరియన్ భాష నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, అలా కియా కంపెనీలో చాలా మంది ఉద్యోగాలు సంపాదించారని కొరియాలోని సాంగ్‌గోక్ యూనివర్శిటీ అంబాసిడర్ కిమ్ హంగ్ జాయ్ స్పష్టం చేశారు. ద్వారకానగర్‌లోని ఇన్నార్ భవనంలో జూలై 1 నుంచి కోర్సులు ప్రారంభం కానున్నాయని, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శనివారం కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 10+2 పాలిటెక్నిక్, ఐటీఐ చదివి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారు, టెక్నికల్ స్కిల్స్ కలిగిన ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రికల్ విభాగాల్లో నైపుణ్యం ఉన్నవారికి కొరియా భాషలో కనీస పరిజ్ఞానం ఉంటే నెలకు రూ. లక్ష వేతనం లభించే అవకాశాలున్నాయన్నారు. రెండు నెలల్లో కొరియా భాష నేర్చుకునేలా సర్టిఫికెట్ కోర్సు విశాఖలో ప్రారంభం కానుందన్నారు. ఆసక్తి ఉన్నవారు 87902 79628లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాక్ సౌత్ కొరియన్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా–తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్ శనివారం రద్దు చేశారు. 2న తిరుపతి–హౌరా(22890) ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–ఎంజీఆర్ చెన్నైసెంట్రల్ (22808) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 4న ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ – సంత్రగచ్చి(22807) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

- విశాఖపట్నంలో శుక్రవారం రాత్రి 9.05 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం– కోర్బా (18518) ఎక్స్‌ప్రెస్ సుమారు 2.30 గంటలు ఆలస్యంగా రాత్రి 11.30 గంటలకు బయలుదేరింది.
- విశాఖపట్నంలో శనివారం బయలుదేరాల్సిన విశాఖపట్నం–బెంగళూరు కంటోన్మెంట్ (08915) వన్‌వే స్పెషల్ సుమారు 2 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయోగాత్మక హాల్ట్
- ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా భువనేశ్వర్ లో జూలై 6న భువనేశ్వర్–సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు మిర్యాలగూడ, నల్గొండలో ప్రయోగాత్మక హాల్ట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

గౌహతి–సికింద్రాబాద్ మధ్య స్పెషల్

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గౌహతి–సికింద్రాబాద్ మధ్య సింగిల్ ట్రిప్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. గౌహతి–సికింద్రాబాద్(05614) స్పెషల్ జూలై 2 ఆదివారం ఉదయం 6 గంటలకు గౌహతిలో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 5.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 5.35 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 10 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీసీపీ సునీత

అల్లిపురం: జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి పది ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారి సునీత పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో 2వ జోన్‌కు రెండు, 5వ జోన్‌కు 4, 6వ జోన్‌కు 1, 8వ జోన్‌కు 3.. మొత్తం 10 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధి, ఎనిమిది జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు ఇష్టానుసారం డంప్ చేసినా జీవీఎంసీలో టోల్ ఫ్రీ నంబరు 18004250009కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే వాట్సాప్ నంబర్ 8187897569కు పూర్తి వివరాలతో పంపితే చర్యలు చేపతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ నరేంద్రరెడ్డి, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని టర్నర్ చౌల్ట్రీలో పదకొండు రోజులుగా భక్తుల పూజలందుకున్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు శుక్రవారం తిరుగు రథ యాత్రలో స్వగృహానికి మరలి వెళ్లారు. ఎమ్మెల్యే వాసుపల్లి, అసిస్టెంట్ కమిషనర్ శిరీష పాల్గొన్నారు. – డాబాగార్డెన్స్